ప్రజాశక్తి

శనివారం 18 నవంబర్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

మార్కెట్ మాయాజాలం

- బిపిటి బియ్యం ధరలు ఆకాశంలో.. ధాన్యం ధరలు పాతాళంలో...
- 75 కిలోల బస్తా రూ.1700 నుంచి రూ.1550కు తగ్గింపు
- స్టీం బియ్యం కిలో రూ.50కు అమ్మకం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్న చందంగా ఉంది రైతుల పరిస్థితి. బిపిటి రకం బియ్యం ధరలు ఆకాశాన్నంటుతుంటే.. మరోపక్క రైతులు విక్రయించే అదే రకం ధాన్యం ధరలు పాతాళంలో ఉంటున్నాయి. రైసు మిల్లర్లు ధాన్యం ధరలను భారీగా తగ్గించారు. నవంబర్ మొదటి రెండో వారాల్లో బిపిటి 5204 రకం 75 కిలోల ధాన్యం బస్తాను 1700 రూపాయలకు కొనుగోలు చేసిన మిల్లర్లు... తాజాగా కొనుగోలు ధరను రూ.1550కు తగ్గించారు. వారం రోజుల వ్యవధిలోనే బస్తా ధాన్యం ధర రూ.150కు పైగా తగ్గిపోయింది. దీనికితోడు తూకంలోనూ మోసం చేయడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రజలు అత్యధికంగా వినియోగించే బిపిటి 5204 రకం బియ్యం ధరలు మార్కెట్లో సామాన్యులను కలవరపెడుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా పాత బియ్యం కిలో రూ.53 నుంచి 58 మధ్య నాణ్యత ఆధారంగా వ్యాపారులు మార్కెట్లో విక్రయిస్తున్నారు. సన్నరకమైన ఈ వరి వంగడాన్ని సాగు చేయడానికి రైతులు అధికంగా వ్యయం చేస్తారు. ఇతర రకాల వరివంగడాలతో పోల్చి చూసినప్పుడు దిగుబడులు తక్కువగా వస్తాయి. అయితే ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ఈ రకం ధాన్యాన్ని అమ్మితే రైతులకు గిట్టుబాటు కాదు.

మార్కెట్లో ఈ రకం ధాన్యం ధరలు అధికంగానే ఉంటాయి. గత ఏడాది సీజన్లో పంట కోత పూర్తయిన తర్వాత 75 కిలోల బస్తాను రూ.1800 నుంచి రూ.2,000 వరకు కొనుగోలు చేశారు. ఈ రకం పాత ధాన్యాన్ని రూ.2,300 నుంచి 2500 వరకు (మిగతా 6లో)

నిల్వ చేసే అవకాశం లేదు

గౌరిశెట్టి రాంబాబు, రైతు, ములపర్రు, బంటుమిల్లి మండలం

గత ఏడాది నూర్చిన వెంటనే 75 కిలోల బస్తాను రూ.1800లకు కొన్నారు. నెల రోజుల తర్వాత రెండు వేలకు కొనుగోలు చేశారు. ఈఏడాది రేటు వస్తుందని సాగు చేశా. వారం రోజుల్లోనే ధర తగ్గిపోయింది. తర్వాత మంచి రేటు వస్తుందని నిల్వ ఉంచుదామన్నా ఆ అవకాశం లేదు. అప్పులు చేసి పంటలకు పెట్టుబడి పెట్టాం. వడ్డీలు పెరిగిపోతాయి.

మిల్లర్లు ధర తగ్గించేశారు

మాగంటి రంగబాబు, రైతు, రామరాజుపాలెం, గూడూరు మండలం

10 ఎకరాల్లో బిపిటి రకం ధాన్యం కోతలు, నూర్పిళ్లు పూర్తయ్యాయి. వారం రోజుల క్రితం 75 కిలోల బస్తా ధాన్యాన్ని మిల్లర్లు రూ.1700కి కొనుగోలు చేశారు. ఇప్పుడు రూ.1550కి మాత్రమే కొంటామంటున్నారు. రేటు తగ్గిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదు. ధర వచ్చే వరకు నిల్వ చేయడమూ సమస్యగా ఉంది. గోడౌన్లను సమకూర్చుకోవాలి. అద్దె చెల్లించాలి. ధాన్యం రవాణా కిరాయిలు, అప్పులకు వడ్డీలు భారంగా మారతాయి.

ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో ఎసిబి సోదాలు

వార్త మెయిన్‌లో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

విమానాశ్రయంలో రాహుల్‌కు స్వాగతం

ప్రజాశక్తి - గన్నవరం : విజయవాడ విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఘనస్వాగతం లభించింది. తెలంగాణా ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం ఇక్కడి విమానాశ్రయానికి వచ్చారు. ఆయనకు ఎపిపిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు శాలువా కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి జె.డి.శీలం, కార్యనిర్వాహక అధ్యక్షులు మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాహుల్ గాంధీ ప్రత్యేక హెలికాప్టర్‌లో తెలంగాణా వెళ్లారు.

బందరు పోర్టు నిర్మాణంలో పురోగతి : కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనుల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం తన చాంబర్లో కలెక్టర్ రాజాబాబుతోపాటు మాజీ మంత్రి, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) పోర్టు, రైట్స్, మెగా నిర్మాణ సంస్థ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సముద్ర కెరటాలను అడ్డుకోవడానికి 2.075 కిలో మీటర్ల దక్షిణ బ్రేక్ వాటర్ గోడ నిర్మాణంలో భాగంగా ఇప్పటికి 1 కిలోమీటర్ దూరం పనులు పూర్తయ్యాయన్నారు. మరో 100 మీటర్ల వరకు మున్ముందుకు సముద్రంలోకి చొచ్చుకు పోతుందన్నారు. మరోవైపు కస్టమ్స్, సెక్యూరిటీ, ఫైర్ స్టేషన్, వేర్ హౌసింగ్ తదితర భవనాల పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. అలాగే ఐదు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంలో ఒక కిలోమీటర్ మేర పటిష్టంగా చదును చేసే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఎంఎల్ఎ పేర్ని మాట్లాడుతూ నిర్దేశించిన గడువు 30 నెలల కంటే ముందుగానే 24 నెలల్లోనే పోర్టు మొదటి దశ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. 250 మంది సాంకేతిక సిబ్బంది, సుమారు 700 మంది కార్మికులు దీని నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి దయాసాగర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విద్యాశంకర్, చీఫ్ ఇంజనీర్ రాఘవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవికె పల్లారావు, మెఘా ఇంజనీరింగ్ సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాఘవేంద్రరావు, రైట్ సంస్థ మేనేజర్ ఎంవిపి రవికుమార్, అసిస్టెంట్ మేనేజర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో కలెక్టర్ రాజాబాబు, ఎంఎల్ఎ పేర్ని

నేడు నీటి పారుదల, వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నీటిపారుదల, వ్యవసాయ సలహామండలి సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నగరంలోని నీటి పారుదల సర్కిల్ ఆవరణలో గల రైతు శిక్షణ కేంద్రంలో జరుగుతుందని నీటి పారుదల సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ టి.జె.హెచ్. ప్రసాద్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 2023-24 నీటి విడుదల, వినియోగం, సలహా మండలి చైర్మన్ల అనుమతితో ఇతర విషయలపై జరుగుతుందని తెలిపారు. సలహా మండలి చైర్మర్లయిన ఆయా జిల్లాల కలెక్టర్లు అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

సౌదారాణి కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం అందించాలి వార్త 6లో

స్వచ్ఛత వైపు మరో అడుగు

పింక్ టాయిలెట్ల ప్రారంభోత్సవంలో మేయర్, కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగర పాలక సంస్థ స్వచ్ఛత వైపు మరో అడుగు ముందుకు వేసిందని విఎంసి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మహిళల పట్ల గౌరవం ప్రదర్శిస్తూ వారి కోసం ప్రత్యేకంగా బెంజ్ సర్కిల్ వద్ద నిర్మించిన పింక్ టాయిలెట్లను విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్, కమిషనర్‌తోపాటు వైసిపి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గా, సబ్ కలెక్టర్ అతిథి సింగ్, 39 డివిజన్ కార్పొరేటర్ షహీన బేగం, 3వ డివిజన్ కార్పొరేటర్ ప్రవల్లిక, 2వ డివిజన్ కార్పొరేటర్ ఎ నిర్మల కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళల కోసం, మహిళలే (మిగతా 6లో)

బెంజిసర్కిల్‌లో ప్రారంభించిన పింక్ టాయిలెట్లు; మీడియాతో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ దినకర్

సబ్‌స్టేషన్లో సాంకేతిక లోపం పరిష్కారం

గంపలగూడెం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో విజయవాడ నుండి వచ్చిన ఆ శాఖ ప్రత్యేక బృందం వచ్చి సవరించినట్లు స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ కొమ్ము వాసు తెలిపారు. వివిధ గ్రామాలకు సరఫరా అవుతున్న కొన్ని మార్గాల్లో సాంకేతికంగా సమస్యలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కారణంగా శుక్రవారం అరగంట పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగిందని తెలిపారు. వినియోగదారులు గమనించాలన్నారు.

'జగనన్న కంటి వెలుగు'లో వైద్యపరీక్షలు

ప్రజాశక్తి వత్సవాయి : మండలం లోని మక్కపేట గ్రామంలో జగనన్న కంటి వెలుగు కార్యక్రమం చేపట్టారు. వీరిలో కంటి ఆపరేషన్ నిమిత్తం 15 మందిని గుర్తించారు. 15 మంది గుంటూరులో కాకాని శంకర కంటి ఆస్పత్రి బస్సులో తరలించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బుర్రకథల ద్వారా సహకార సంఘాలపై ప్రచారం

ప్రజాశక్తి - గంపలగూడెం : ఉమ్మడి కష్ణాజిల్లా వ్యాప్తంగా కెడిసిసి బ్యాంకు చైర్మన్, సిఇఒ ఆదేశాల మేర గ్రామాల్లో బుర్ర కథల ద్వారా సహకార సంఘాల ఉపయోగాలను వివరిస్తున్నారు. శుక్రవారం తోటమూలలో ఈ బందం సహకార సంఘాల పొదుపు ద్వారా వచ్చే లాభాలు, రుణ సౌకర్యాలు తదితర అంశాలను ప్రజలకు కళ్ళకు కట్టినట్లుగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలతోపాటు స్థానిక కెడిసిసి బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు, మేనేజర్ ఎస్ కనకదుర్గ, సూపర్వైజర్లు ఏసుబాబు, ఏడుకొండలు, సిబ్బందితో పాటు చిన్న కొమెర పిఎసిఎస్ చైర్మన్ గువ్వల సత్యనారాయణ రెడ్డి, సీఈవోఎస్ కష్ణ, సిబ్బంది బుర్రకథ సారాంశాన్ని తిలకించి ఆస్వాదించారు.

వక్రమార్గంలో గెలిచేందుకు వైసిపి ప్రయత్నం

గంపలగూడెం : అధికార ప్రభుత్వం వక్రమార్గంలో గెలవాలని ఆరాటపడుతున్నట్లు మండల టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు, రేగళ్ల వీరారెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం తోటమూలలో ఉన్న ఆ పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. ప్రొద్దుటూరు, కడప తెలుగుదేశం పార్టీ నాయకుల అక్రమ అరెస్టులు ఇందుకు మచ్చుగా పేర్కొన్నారు. సాగర్ జలాల ఒకటి, రెండు జోన్ల పరిధిలో కొంతైనా నీరు అందిస్తే పంటలు బయటపడేవని తెలిపారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హెచ్‌పిసిఎల్ ఆయిల్ కాంట్రాక్టు వర్కర్ దేవరకొండ వెంకటేశ్వర రావు కుటుంబానికి న్యాయం చేయాలని హెచ్‌పిసిఎల్ ఆయిల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మెయిన్ గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. దేవరకొండ వెంకటేశ్వరావు స్థానంలో వారి కుమారుడు జీవన్‌కు పని కల్పించాలని ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు, వర్కర్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కాంట్రాక్టు వర్కర్‌గా 25 సంవత్సరాలు సంస్థ అభివద్ధి కోసం కృషి చేసిన వ్యక్తి వెంకటేశ్వరరావు అన్నారు. ఇతర ప్రభుత్వ రంగ సంస్థలో పని బదిలీకి అవకాశం ఉంటే హెచ్‌పిసిఎల్ ఆయిల్ కంపెనీ యాజమాన్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించటం చాలా దుర్మార్గమన్నారు. పరామర్శకు వచ్చినప్పుడు పని ఇస్తామని హామీ ఇచ్చి నేడు కుంటి సాకులు చెబుతున్నారని మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ ఆయిల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ శేఖర్ సెక్రటరీ రాజశేఖర్, శేషగిరి పాల్గొన్నారు.

గేటు ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

వత్సవాయిని కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావును సిపిఎం మండల కమిటీ బందం కలిసింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మండలం వ్యవసాయ ఆధారిత మండలం ప్రధానంగా వర్షాలు తక్కువ కురవడం, సాగర్ నీరు రాకపోవడం వల్ల వందలాది ఎకరాల భూమి బీడుభూములుగా మారాయన్నారు. పశువులకు తాగగడానికి అవసరమైన నీరు లేదన్నారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలంలో ఉన్న దాదాపు ఇరవై ఆరు వేల ఎకరాలకు నీరు అందించే పోలంపల్లి వద్ద ఉన్న మున్నేరు ప్రాజెక్ట్‌కు గండ్లు పడ్డాయని, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించి ఆయకట్టు రైతులను ఆదుకోవాన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ అంతరాష్ట్ర రహదారిగా ఉన్న లింగాల గ్రామం వద్ద మునేటి కావేజ్‌పై నూతన బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. వత్సవాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు డాక్టర్‌ని మెడికల్ సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి టి.రమేష్ జిల్లా నాయకులు సిహెచ్.హనుమంతరావు మండల కమిటీ సభ్యులు బి.రాము కె.కొండయ్య వై. వెంకటరత్నం పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పలుచోట్ల

క్విజ్, వ్యాసరచన పోటీలు

విజయవాడ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లో విద్యార్థులకు 'మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాలు – యువతపై ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కె.నజ్మా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావం బాలలపై ఎక్కువగా ఉంటుందని, ముందు జాగ్రత్తతోనే మాదక ద్రవ్యాల అలవాటు, ఆలోచనలను అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావచ్చని, పిల్లలు పెద్దలు సోషల్ మీడియాకి ఎక్కువగా ఆకర్షితులు అవుతున్నారని, ప్రతిరోజు సామజిక మాధ్యమాలు అయినా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, వాట్సఅప్ మొదలైన మాధ్యమాలు, యూట్యూబ్‌కి ఆకర్షితులవుతున్నారని, వీటివల్ల యువతకు, బాలలకు మంచి కంటే చెడే ఎక్కువగా జరుగుతుందని అన్నారు. అనంతరం ఈ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రూపాకుమారి, ఉపాధ్యాయులు సి.రాణి శ్రీకంఠ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **విజయవాడ అర్బన్ :** తెలుగు హాస్య రచనలకు కొత్త పరిమళాలు అద్ది ఆరోగ్యవంతమైన హాస్యాన్ని అందించిన శ్రీరమణ పండించిన హాస్యం అసమాన్యమైనదని ప్రముఖ రచయిత కొప్పర్తి రాంబాబు అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంతరాయ గ్రంథాయలంలో హాస్య రచనలపై సదస్సు నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ హాస్య రచనల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బండ్ల మాధవరావు, ఎం.ఆర్.ఎస్.ప్రకాశరావు, డాక్టర్ జి.వి. పూర్ణచంద్, డోగిపర్తి శంకరరావు పాల్గొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 19న బెంజిసర్కిల్ వద్ద గల సర్వోత్తమ గ్రంథాలయంలో జరిగే కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరుకానున్నారని సర్వోత్తమ గ్రంథాలయం కార్యదర్శి డాక్టర్ రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. సర్వోత్తమ గ్రంథాలయం అధ్యక్షులు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం అధ్యక్షులు కె.సి.కల్కురాతో పాటు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పాల్గొంటారన్నారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి శాఖ గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కొండపల్లి పట్టణంలోని వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో జూనియర్స్ విభాగంలో సేవ్ ట్రీస్ సేవ్ ఎర్త్ సీనియర్ విభాగంలో మాకు ఇష్టమైన దేశ నాయకులు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు జూనియర్స్ వందమంది సీనియర్ 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి డి.చంద్రశేఖర్, పిఆర్ బాలకష్ణారావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని జగ్గయ్యపేట ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో 4వ రోజు శుక్రవారము వ్యాసరచన, వక్తత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో చేగు పాఠశాల, సిటీ సెంట్రల్ స్కూల్, విజేత పబ్లిక్ స్కూల్, నాగార్జున స్కూల్, విజ్ఞాన్ హై స్కూల్, శ్రీ వెంకటేశ్వర స్కూల్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, టి జి పాలెం జడ్‌పిహెచ్‌ఎస్, బాలికలు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కె అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాల, వాగ్దేవి డిగ్రీ కళాశాల తదితర పాఠశాలలకు చెందిన 154 మంది విద్యార్థిని, విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ వారోత్స వాలను ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ వారోత్సవాలు జరుగుతున్న తీరు పట్ల సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి నగేష్, పరిశీలకులుగా విచ్చేసిన సిహెచ్‌ఎస్ దీక్షితులు, కవి, రచయిత, తెలుగు ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారిని ఆలేటి ప్రభ, తదితరులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** గ్రంథాలయాల అభివద్ధితో పాటు, విద్యార్థులు, పాఠకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రంథాలయ సంస్థ సిద్ధంగా ఉందని ఉమ్మడి కష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. కంచికచర్ల శాఖ గ్రంథాలయాన్ని, రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖా అసిస్టెంట్ డైరెక్టర్ దీక్షితులు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి నగేష్ శుక్రవారం సందర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చేత సరఫరా చేయబడిన జిరాక్స్ మెషీన్‌ని చైర్ పర్సన్, గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠకుల కోరిక మేరకు గ్రంథాలయానికి అవసరమైన కంప్యూటర్స్, నూతన పుస్తకాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామ చంద్రుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ రంగిశెట్టి వెంకటేశ్వర్లు, మొగుళూరు బి.డి.సి నిర్వాహకుడు ఎ.పెరయ్య, తదితరులున్నారు. **మైలవరం :** గ్రంథాలయంలో శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన జడ్పీ జిహెచ్‌ఎస్ ఉపాధ్యాయిని సిహెచ్.మాధవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది నాగార్జున, సయ్యద్ అహ్మద్ విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ, రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖా అసిస్టెంట్ డైరెక్టర్ దీక్షితులు, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, నగేష్ హాజరయ్యారు. గ్రంథాలయంలో రికార్డులు, పుస్తకాలు పరిశీలించారు. క్విజ్ మాస్టర్‌గా జిల్లా పరిషత్ హైస్కూల్ తెలుగు పండిట్ ఎస్‌కె.ఇస్మాయిల్, కంచికచర్ల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అమర్లపూడి కనకారాజు క్విజ్ పోటీలకు జడ్జిస్‌గా వ్యవహరించారు. కవి సమ్మేళనంలో భాగంగా అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఇస్మాయిల్ కవిత వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ రంగిశెట్టి వెంకటేశ్వర్లు, మొగుళూరు బి.డి.సి నిర్వాహకుడు ఎ.పెరయ్య, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్విజ్ పోటీకి 10 టీములుగా 70 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి ఉషోదయ స్కూల్, ద్వితీయ బహుమతి కంచికచర్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. **గంపలగూడెం:** శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా, విద్యార్థులకు సెమినార్లు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గంపలగూడెం శాఖ నుండి ఎంపిపి ఎన్టీఆర్, స్పెషల్, ఎస్సి బిసి స్కూల్స్‌లో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఇన్‌ఛార్జ్ శంకర్ నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు కవి సమ్మేళనం, సెమినార్లు నిర్వహించినట్లు ఇన్‌ఛార్జ్ శ్రీలత వివరించారు. **తిరువూరు :** తిరువూరు సత్యసాయి సేవా సమితి అధ్వర్యంలో ఆచార్య దేవోభవ అంశం మీద నిర్వహించిన వ్యాసరచ న పోటీలో సిద్ధార్ధ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ ఉప్పలపాటి చక్రపాణి, ఉపాధ్యాయులు శుక్రవారం పాఠశాలలో అభినందించారు.

నవజీవన్ బాలభవన్‌లో మాట్లాడుతున్న ఎస్‌కె.నజ్మా

జగ్గయ్యపేటలో...

కంచికచర్లలో...

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: కమిషనర్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ 20వ వార్డు అనాసాగరంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.జయరాం పర్యటించారు. హైవే పక్కన ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. జిమ్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, ఎటువంటి వాహనాలు అక్కడ నిలుపకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ అంతర్గత రోడ్లు శుభ్రం చేయించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కాలవల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. వార్డులో జరుగుచున్న డే ఫాగింగ్, దోమల మందు పిచికారీని పరిశీలించారు. వీధి దీపాల పనితీరు, మంచినీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలవల వెంట పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ జయరామ్

టిడిపి మేనిఫెస్టో పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాష్ట్ర టిడిపి పిలుపుమేరకు పట్టణంలో 16వ వార్డు చెరువు బజారులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ ఇంటింటికి వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే 'జగనన్నకు చెబుదాం' లక్ష్యం

రైతుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-బంటుమిల్లి : ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాంమండల స్థాయి ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం శుక్రవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో కలిసి నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి బుధ, శుక్రవారాలలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో ప్రధానంగా తాగునీటి సమస్యపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. బంటుమిల్లితోపాటు కత్తివెన్ను మండలంలో కూడా ఇదే సమస్య ఉందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన బడ్జెట్ కేటాయించి ఫిల్టర్ బెడ్స్ మరమ్మ తులు చేయించడం జరుగు తుందని అన్నారు. అనంతరం కలెక్టర్ విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు, విద్యుత్ ఆదాకు చిట్కాలపై సిపిడిసిఎల్ ముద్రించిన గోడపత్రికలను జాయింట్ కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బందర్ ఆర్డీవో ఎం.వాణి, డ్వామా పిడి జివి సూర్యనారాయణ, డిఆర్‌డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్, డీఎస్ఓ పార్వతి, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి గీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు కలెక్టర్

- కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

రాజాబాబుకు వినతిపత్రం అందించారు. బంటుమిల్లి మండలంలో శుక్రవారం జరిగిన జగనన్నకు చెప్పుకుందాం కార్యక్రమంలో రైతాంగ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. 2020 సంవత్సరం ఏప్రిల్ నెలలో తుఫాన్, వడగండ్ల వాన ప్రభావానికి బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లో దాదాపు 4524 మంది రైతులకు సుమారు మూడు కోట్ల 36 లక్షల రూపాయలు అప్పుడు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించిందని, కానీ ఇప్పటివరకు రైతులకు అందలేదన్నారు. అలాగే 2022 – 23 సంవత్సరం, సార్వా పంట తాలుకా ధాన్యం రవాణా చార్జీలు ఇప్పటివరకు సంబంధిత రైతులకు ఇవ్వలేదని, అలాగే బంటుమిల్లి సర్పంచ్ కాలువ పరిధిలో ఉన్న చోరంపూడి కాలువ పరిధిలో సుమారు 2000 ఎకరాల వరకు ఆయకట్టు ఉందని, దానిలో సుమారు 800 ఎకరాలు మెరక ప్రాంతం అవటం వలన పంట భూములకు నీరు అందటంలో ఇబ్బంది కలుగుతోందన్నారు. దీంతో దిగుబడి తగ్గడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి మండల రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, మలిశెట్టి శివరాం ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్ , రైతు సంఘం సీనియర్ నాయకులు సుబ్బానం జనార్దన్ రావు, కంఠంనేని మురళి మోహన్ రావు ,సుంకర నాగమల్లేశ్వర రావు ,గౌరిశెట్టి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవనిగడ్డ ఒకటవ సచివాలయం అశ్వరావుపాలెం మూడవ సచివాలయం పరిధిలోని వాలంటీర్లకు కబడ్డీ,ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ ఆటలలో శిక్షణ శిబిరం నిర్వహించారు. శుక్రవారం అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎం మరియాదేవి, ఎంఈఓ 2 అన్నపరెడ్డి పిచ్చయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి ఎన్ వి గోపాల్, పీఈటీలు ఎం ఉదయ్ కుమార్, ఎస్ శ్రీకాంత్, ఏ భాను ప్రకాష్, వీర కుమారులు పాల్గొని శిక్షణ ఇచ్చారు

విద్యార్థులు భావి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : విద్యార్థులు జీవన నైపుణ్యాన్ని పెంపొం దించుకోవాలని ఈఎం డిఓ మేనేజర్ భాను కిరణ్ అన్నారు. శు క్రవారం ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లను ఈఎండిఓ జిల్లా మేనేజర్ జంపాన భాను కిరణ్ సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు భావి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని భవిష్యత్తులో మీరే స్వశక్తి ద్వారా జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇఎండిసి పథకం తోడ్పడుతుందని తెలిపారు.ప్రతి విద్యార్థి సమాజ మార్పు కొరకు కృషి చేసిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని స్వీయ అవగాహనతో జీవితంలో స్థిరపడాలని అవసరమైన పలు సూచనలు విద్యార్థులకు అందించారు. ఈ పాఠశాలలో ఈఎండిసి పథకాన్ని చక్కగా నిర్వహిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిహెచ్ అనిత, ఉపాధ్యాయిని కోట మేరీ థెరిసాలను అభినందించారు.

30 గంటల దీక్ష జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గన్నవరం : భారత కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన 30 గంటల దీక్ష జయప్రదం చేయాలని పార్టీ గన్నవరం నియోజక వర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు కోరారు.గన్నవరం నియోజక వర్గ కార్యాలయంలో 30 గంటల దీక్ష వాల్ పోస్టర్లు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 20,21 తేదీల్లో విజయవాడలో జరిగే 30 గంటల నిరసన దీక్ష జయప్రదం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో గన్నవరం సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, ఎస్వీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పెద్దు వెంకటరత్నం పాల్గొన్నారు. **ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** కృష్ణా జలాల పునః పంపిణీ పై గెజిట్ నోటిఫికేషన్ రద్దు కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ భవిత కోసం కరువు నివారణ సహాయక చర్యల కోసం నవంబర్ 20, 21 తేదీలలో విజయవాడలో జరుగు నిరసన దీక్ష జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం గోడపత్రిక ఆవిష్కరణ చేశారు. సిపిఐ మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఒంటి పులి లక్ష్మణరావు, సిపిఐ నాయకులు మోదుమూడి నాగరాజు, సయ్యద్ మౌలా, బిక్షు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ కమలా కిరణ్

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ : పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని సర్పంచ్ సరిపల్లి కమలా కిరణ్ అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలో పారిశుధ్య పనులను సర్పంచ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పరిశు భ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. పరిశు భ్రతకు సహకరించాలన్ని పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటూ చెత్తను మురికి కాలంలో వేయకుండా గ్రామ అభివృద్ధికి సహకరించాలని అన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత

ప్రజాశక్తి-పెదపారుపూడి : దాతల సేవ మరువలేమని ఎంఈఓ గుడ్డ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎలమర్రు ప్రధానోపాధ్యాయులు రావెళ్ళ వరుణ కుమార్ 20,000 రూపాయల విలువ గల ఇన్వర్టర్‌ను పెదపా రుపూడి మండల విద్యాశాఖ కార్యాలయానికి అందిం చారు. ఎంఇఒ-2 సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆకునూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు రూ.42వేలు విలువచేసే సౌండ్ సిస్టం అదే పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు కొడాలి శ్రీరమ తన తల్లి కొడాలి కస్తూరిబాయి జ్ఞాపకార్థం శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 42 సంవత్సరాలపాటు ఉపాధ్యాయురాలిగా పలు పాఠశా లల్లో పనిచేసిన తన తల్లి కస్తూరిబాయి వయోభారంతో సర్వస్తురాలుకాగా ఆమె జ్ఞాపకార్థం పాఠశాలకు అవసరమై న వస్తువును బహుకరించ చామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నక్కా సలోమి విద్యకమిటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

సౌండ్ సిస్టం అందజేస్తున్న కొడాలి శ్రీరమ

అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు ప్రారంభం

కబడ్డీపోటీలు ప్రారంభిస్తున్న తాతినేని శ్రీహరిరావు, నూకల సాంబశివరావు

ప్రజాశక్తి- ఉయ్యూరు : కష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో 12వ బాలికల అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలు ఏజీ అంన్ఎస్ఓఎస్ కళాశాల ఆవరణలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈపోటీలను కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు, సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల సాంబశివరావు ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. విద్యతోపాటు క్రీడలకు సముచిత ప్రాధాన్యతనిచ్చి ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి పేరు ప్రఖ్యాతులు గడించాల న్నారు. తలితండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించి క్రీడాకారులుగా తీర్చి దిద్దాలన్నారు. వివిధ కళాశాలకు చెందిన 7 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీరామ్, జూనియర్ కళాశాల డైరెక్టర్ విన య్ కుమార్, వ్యాయామ అధ్యాపకుడు పి. చంద్రబాబు పర్యవేక్షించారు.

మనుషుల అక్రమ రవాణా నివారణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న బలరామకృష్ణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : మనుషుల అక్రమ రవాణాలను నిరోధించడం సమాజంలో అందరి బాధ్యత అని హైదరాబాదుకు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ తెలిపారు. అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణా పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల కృష్ణ మాట్లాడుతూ ఈ అక్రమ రవా ణాకు లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ పోలీస్ విద్యా శాఖ న్యాయ శాఖల సమన్వయంతో ఎప్పటి వరకు 28,200 మంది అమ్మాయిలను మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. దీనిని రూపుమాపణంలో విద్యార్థి జాగతి సంఘాలను ఏర్పాటు చేయడం ద్వారా అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అక్రమ రవాణాకు గురైన పిల్లలను శ్రమదోపిడి, అవయవాల దోపిడి, లైంగిక దోపిడికి గురి చేస్తున్నారన్నారు. విద్యార్థి జాగతి సంఘాలు తమ పరిధిలోని మహిళలకు పిల్లలకు అవగాహన కల్పించి జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజనాల అంకారావు, ప్రజ్వల కోఆర్డినేటర్ సురేష్ కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ తదితరులు పాల్గొన్నారు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - వత్సవాయి : జిల్లా మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వత్సవాయిలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యను పాజిటివ్‌గా తీసుకొని పనిచేయాలని సూచించారు. అధికారులు సాధ్యమైనంత త్వరలో సమస్యల పరిష్కారం కోసం పని చేయాలన్నారు. ప్రతి అర్జీకి రెప్రెజెంటేషన్ సమాధానం వెంటనే చెప్పాలని కోరారు. ముందుగా వత్సవాయి గ్రామ సర్పంచి భూక్య సీతమ్మ జిల్లా కలెక్టర్ డిల్లీరావును సన్మానించేందుకు స్టేజి దగ్గరికి వెళ్లగా ఆమెను అభినందిస్తూ తీసుకొచ్చినా చాలు అంటూ శాలువా కప్పి సత్కరించారు. జడ్పిటిసి ఏసుపోగు దేవమని, ఎంపిపి కొలుసు రమాదేవి వత్సవాయి సొసైటీ అధ్యక్షులు రంగశెట్టి ముత్తయ్య కలెక్టర్ డిల్లీరావును, సబ్ కలెక్టర్‌ను సత్కరించారు. అనంతరం అర్జీలు సమర్పించారు. జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, అధికారులు, హాజరయ్యారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డిల్లీరావు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : నగరంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మెడికల్ కమిటీ, హెల్త్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కళాశాల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. మొగల్‌రాజపురంలోని కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరంలో 1500 మంది విద్యార్థులకు వైద్య సేవలను అందించినట్లు తెలిపారు.

అచ్చెన్నాయుడికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కుమ్మర్ల సమస్యలు పరిష్కరించండి

బొమ్మిన కోటేశ్వరరావు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : కుమ్మర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిన కోటేశ్వరరావు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి వినతిపత్రం సమర్పించారు. విజయవాడలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో జరిగిన బిసి విభాగ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి కుమ్మర్ల సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాన్ని అందజేసిన ఆంధ్రప్రదేశ్ కుమ్మరి యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిన కోటేశ్వరరావు, కష్ణాజిల్లా అధ్యక్షులు కేదరాశి పల్లి నరేంద్ర ప్రజాపతి కుమ్మర్ల డిమాండ్స్ నీ 2024 ఎన్నికల్లో మానిఫెస్టో పెట్టాలని కోరారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళా పారిశ్రామిక వేత్తల పాత్ర కీలకం

సబ్ కలెక్టర్ అదితిసింగ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆర్థిక సంస్కరణల అనంతరం దేశంలో మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్ (కొవే) ఆధ్వర్యంలో నగరంలోని ఒక హోటల్లో శుక్రవారం జరిగిన మహిళా పారిశ్రామిక వేత్తల సత్కార కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యాధికులైన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా మరి కొంతమందికి ఉపాధి కల్పించేందుకు కషి చేయాలని కోరారు. ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదిగితే మరెంతోమంది మహిళలకు ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. తద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఎదగడమే కాకుండా వారి వారి కుటుంబాలలోని సంతానం కూడా విద్యాధికులుగా తయారవుతారన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అభివద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. కిరణ్ మజుందార్ షా, ఇంద్రా నూయి వంటి సాధారణ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా మారిన తర్వాత దేశంలోనే అత్యంత శక్తివంతమైన మహిళలుగా ప్రసిద్ధి చెందారన్నారు. అటువంటి శక్తి కలిగిన మహిళలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో నిరంతరం వస్తున్న మార్పులను మహిళా పారిశ్రామిక వేత్తలు గుర్తించి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలు స్థాపిస్తే స్వల్ప కాలంలోనే విజయం సాధించవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా పారిశ్రామికవేత్తల ఆర్థిక అభివద్ధికి ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నాయని, అటువంటి అంశాలను నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి వి ఆర్ విజయ రాఘవ నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కుటీర పరిశ్రమల అభివద్ధి కోసం సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఏపీ చాంబర్స్ ప్రెసిడెంట్ పొట్లూరు భాస్కరరావు మాట్లాడుతూ తమ ఛాంబర్ లో ఉన్న ఎన్నో అనుబంధ విభాగాలలో మహిళా పారిశ్రామికవేత్తల సమాఖ్య ఎంతో ఉత్తేజితంగా పనిచేస్తోందన్నారు. అనంతరం వివిధ రంగాలలో ప్రతిభా పాటవాలను చాటిన 125 మంది మహిళా పారిశ్రామికవేత్తలను సత్కరించారు. కార్యక్రమంలో కొవే ఇండియా చైర్ పర్సన్ పి.సౌదామిని, జాతీయ అధ్యక్షురాలు ఆలూరి లలిత, రాష్ట్ర అధ్యక్షురాలు రాధిక ఇతరులతో సహా వ్యాపార, తయారీ రంగాలకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామిక వేత్తలను సన్మానిస్తున్న అధితి సింగ్

మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో ఈనెల 24న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని గెంటేల శకుంతలమ్మ కళాశాల ఆవరణంలో జగ్గయ్యపేట పట్టణ, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివద్ధి, మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లే సదుద్దేశమే సామాజిక సాధికార బస్సు యాత్ర లక్ష్యమన్నారు. బడుగు బలహీన వర్గాలకు ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారని, వారందరినీ కలుపుకునేందుకు ఈ బస్సు యాత్ర ద్రోహద పడుతుందన్నారు.

కెబిఎన్ కాలేజీలో మెగా ప్లాంటేషన్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాలుష్య నివారణకు మొక్కలు పెంచడం అవసరమని లయన్స్ క్లబ్స్ గవర్నర్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొత్తపేటలోని కెబిఎన్ కాలేజీ పూర్వ విద్యార్థి, ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారి జూలూరి శివ ప్రస్తుతం కెబిఎన్ కాలేజీలో జరుగుతున్న బ్యూటిఫికేషన్‌లో భాగంగా తనవంతుగా అనేక రకాల మొక్కలను కాలేజీ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పిన విద్యాసంస్థను మర్చిపోకుండా కాలేజీకి ఆవరణలో ఈ ఒక్క నెలలోనే వెయ్యి ముక్కలు నాటి కాలేజ్‌పై తనకున్న ప్రేమాభిమానాలను చాటుకున్నారని అన్నారు. అలయన్స్ ఇంటర్నేషనల్ లైఫ్ సపోర్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని (వావ్) వరల్డ్ ఆర్గానిక్ వారియర్స్ ప్లాంటేషన్ చైర్ పర్సన్ జూలూరు శివ తమ సంస్థలోని సభ్యులందరితో కలిసి కెబిఎన్ కాలేజీ యాజమాన్యం విద్యార్థులు ఈ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో కెబిఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ , విద్యార్థులతో పాటు వావ్ ముఖ్య కార్య నిర్వాహకులు రైల్వే శ్రీనివాస్, లలితా రాణి, శోభారాణి, పోతిన శ్రీనివాసరావు, ఆర్గానిక్ ప్రకాష్, తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.

గిరిజనుల జీవితం వైవిధ్యభరితం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భారతదేశంలో జీవిస్తున్న గిరిజనుల జీవన విధానం వైవిధ్యభరితమని ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ టి.శ్రీనివాసన్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎకనామిక్స్, కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'భారతదేశంలో గిరిజనుల జీవితం అభివద్ధి విస్తతి' అంశంపై రెండు రోజులపాటు జరిగే జాతీయ సదస్సు శుక్రవారం ఆ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ సభకు ఆచార్య టీ శ్రీనివాసన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అభివద్ధి పేరుతో యావత్ ప్రపంచం కాలుష్య సహితమై మానవ జీవనం అనేక ప్రభావాలకు గురవుతుందన్నారు. అయితే ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, సదుపాయాలు లేకున్నా గిరిజనుల జీవితం అత్యంత ఆరోగ్యకరంగా, సంప్రదాయ బద్ధంగా ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. గిరిజనులు వారి సంప్రదాయాలను, జీవన విధానాలను వదిలి బయటకు వచ్చే క్రమంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యవక్తగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య రెగ్యులేటరీ అండ్ మోనిటరింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు ఆచార్య పి.విజయప్రకాష్, సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ భారతదేశంలో 143 కోట్ల ప్రజలు జీవిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సదస్సు పరిశోధన పత్రాల సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు అన్నామలై విశ్వవిద్యాలయం కామర్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఆర్.రామచంద్రన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ సిహెచ్.వేణుబాబు, కామర్స్ విభాగాధిపతి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

'అవినీతికి కేరాఫ్ టిడిపి'

ప్రజాశక్తి - భవానీపురం : అవినీతికి కేరాఫ్ అడ్రస్ టిడిపిగా మారిందని పలువురు వైసిపి నాయకులు విమర్శించారు. శుక్రవారం స్థానిక భవానీపురంలోగల ఎన్టీఆర్ జిల్లా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు వైకాపా కార్పొరేటర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 34వ డివిజన్ కార్పొరేటర్ బండి పుణ్యశీల మాట్లాడుతూ టిడ్కో ఇల్లు ఇప్పిస్తానని నాలుగు కోట్ల రూపాయలు స్కామ్ చేసిన మాజీ కార్పొరేటర్ కొట్టేటి హనుమంతరావు సహా పలువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. ఎస్సి నాయకులు దాసి జయప్రకాష్ (కెనడి) మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు గుడివాడ రాఘవ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రమాదాలను అరికట్టాలని వినతి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ మెరుగుపర్చాలని నందిగామ ఆర్‌డిఒ కార్యాలయంలో న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. బైకు ప్రమాదానికి గురై మృతిచెందిన కెవిఆర్ కళాశాల విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యదేవర సుబ్బారావుకు న్యాయవాదులు నివాళులర్పించారు. నందిగామ పట్టణ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నందున, రోడ్లు విస్తరణ జరిగిన ప్రదేశంలో డివైడర్లు ఏర్పాటు చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని, 18 సంవత్సరాల లోపు పిల్లలు వాహనాలు నడపకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఓవర్ స్పీడ్ వెళ్లే వారికి ఫైన్ విధించాలని, తక్షణమే ప్రజల సౌకర్యార్థం కొరకు, ట్రాఫిక్ బోర్డులు, డివైడర్లు ఏర్పాటు చేసి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు ఎన్టీఆర్ జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యులు, హైకోర్టు న్యాయవాది ఎక్కిరాల హనుమంతరావు, పాల్గొన్నారు.

రైస్ గ్రెయిన్ టెక్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రైతులకు, మిల్లర్లకు ఉపయోగపడే మిషన్లు రైస్ గ్రెయిన్ టెక్ ఎక్స్ పో ప్రదర్శనలో ఏర్పాటు చేయడం అభినందనీయమని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. రైస్ ప్రాసెసింగ్ సొల్యూషన్స్ ప్రక్రియలో వ్యర్థాలను తగ్గించడం, మానవ శక్తిని తగ్గించడం, ఆహార ప్రాసెసింగ్‌లో పరిశుభ్రమైన ప్రమాణాల పెంచడానికి ఉపయోగపడే మిషనరీలు ప్రదర్శనలో ఉన్నాయని చెప్పారు. ఈ మిషనల పనితీరును సిఎం జగన్ కు వివరిస్తానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న రైస్ గ్రెయిన్ టెక్‌ఎక్స్‌పోను పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. నూతన టెక్నాలజీతో ఆహార ధాన్యాల ప్రాసెసింగ్ ఏ విధంగా చేయాలో నిర్వాహకులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు, మిల్లర్లకు ఉపయోగపడే మిషన్లు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. రైస్ ప్రాసెసింగ్ సొల్యూషన్స్ ప్రక్రియలో వ్యర్థాలను తగ్గించడం, మానవ శక్తిని తగ్గించడం, ఆహార ప్రాసెసింగ్‌లో పరిశుభ్రమైన ప్రమాణాల పెంచడానికి ఉపయోగపడే మిషనరీలు ప్రదర్శనలో ఉన్నాయని చెప్పారు. ఈ మిషనల పనితీరును సీఎం జగన్ కు వివరిస్తానని స్పష్టం చేసారు. రాబోయే రోజులో రైతులకు అందించేలా కషి చేస్తామని అన్నారు. అనంతరం నిర్వాహకులు డి. వీరభద్రరావు షెయినీ ట్రైనీ ఎగ్జిబిషన్స్ ఆర్గనైజర్ ఎస్.కే బాజీ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రాష్ట్రంలోని మిల్లర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రైస్ ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న దృశ్యం

ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.3 కోట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో జరిగింది. కృష్ణాజిల్లాకు సంబంధించి డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధులు ప్రస్తుతం రు. 32.45 కోట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ నిధుల నుండి కృష్ణాజిల్లాలో ప్రతి నియోజకవర్గానికి రు.3 కోట్ల చొప్పున కేటాయించుటకు ఈ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల్లో ట్రస్ట్ నిబంధనలకు లోబడి అత్యవసర ప్రాధాన్యత గల అభివద్ధి పనులు చేపట్టుటకు సంబంధిత శాసనసభ్యుల వారి ఆమోదం పొంది, వెంటనే ప్రతిపాదనలు పంపాలని వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉమ్మడి కష్ణ జిల్లా లో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధుల నుండి వివిధ నియోజకవర్గాల్లో అభివద్ధి పనులు చేపట్టుటకు ఇదివరకే కేటాయించబడిన రు. 19 కోట్ల రూపాయల పనులు నిర్దేశించిన సమయంలో చేపట్టనందున (ఎగ్జిక్యూట్) ఆ పనులను రద్దు చేయుటకు ఈ సమావేశంలో నిర్ణయించినట్లు, ఈ విషయం మినిట్స్ లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.తొలుత జిల్లా గనుల భూగర్భ శాఖాధి కారి టీ. కొండారెడ్డి డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధులు కేటాయించే పాలసీ విధానం సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ , బందరు, పెనమలూరు, అవనిగడ్డ శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

ఘంటసాలలో దాసరి అమరేంద్ర పర్యటన

ప్రజాశక్తి-ఘంటసాల : భారత కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు, కీర్తిశేషులు దాసరి నాగభూషణరావు తనయులు, ప్రముఖ యాత్రికులు, సాహితీ వేత్త ఢిల్లీ బెల్ కంపెనీ రిటైర్డ్ జీఎం దాసరి అమరేంద్ర శుక్రవారం ఘంటసాలపాలెం, ఘంటసాల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ తో కలిసి తుమ్మల వేణుగోపాలరావు వికాస కేంద్రం సందర్శించారు. అమరేంద్ర తెలుగు యాత్రా సాహిత్యంలో విశేషమైన కృషి చేస్తున్నారు. గత 40 సంవత్సరాలుగా ఆయన చేసిన ప్రయాణాలు అన్నీ పలు పుస్తకాల రూపంలో వెలువరించారు. ఎప్పటి నుండో ఘంటసాల ప్రాంతాన్ని , ఇక్కడి విశేషాలను దర్శించాలని ఉందని, ఈ ప్రాంతంలో ఉన్న విశేషాలు, ఇక్కడి మనుషులతో గడపటం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. వికాస కేంద్రం నిర్వాహకులు వేమూరి శివయ్య , మూల్పూరి వెంకయ్య , వేమూరి ప్రసాద్ పలువురు గ్రామస్థులు వారిని సన్మానించారు. అనంతరం ఘంటసాల బౌద్ధ స్తూపం, బౌద్ధ మ్యూజియం సందర్శించి వీటి నిర్మాణ కాలనిర్ణయం ముఖ్య విశేషాలు తెలుసుకున్నారు. ఘంటసాల గ్రామ ప్రాచీన వారసత్వ చిహ్నాలు (గాయక ఘంటసాల, గౌతమ బుద్ధ ,జలధీశ్వర్ స్వామి) విగ్రహాలు దర్శించి గ్రామ పురాతన విషయాలు చిత్రీకరించారు. వీరపనేని సరోజినీ పార్క్‌లో జరిగే అభివృద్ధి చూసి అన్ని మతాలకు వర్గాలకు, అన్ని కార్యక్రమాలకు అనువుగా అభివద్ధి చేసే వీరపనేని సుబ్రహ్మణ్యంని ప్రశంసించారు. ఎన్టీఆర్ ప్రాంగణం లో వున్న గ్రామ పంచాయితీ భవనం లో సర్పంచ్ బి. వెంకటేశ్వరమ్మ, ఈఓ టి జయలక్ష్మిలను కలుసుకొని మహిళలకు పరిపాలన పరమైన సమస్యలు చర్చించారు. జలధీశ్వర స్వామి ఆలయం లో పురాతన చరిత్ర తెలిపే శాసనం పరిశీలిం చారు. కోట ముత్యాలమ్మ తల్లి దేవాలయం ప్రాగణం చుట్టూ తిరిగి దేవాలయ చరిత్ర అర్చకుని ద్వారా తెలుసుకొన్నారు. తన తండ్రి దాసరి నాగభూషణరావు రాజ్య సభ నిధులతో నిర్మించిన భావనా ఋషి కమ్యూనిటీ హాల్ దర్శించారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి: చలసాని

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : పాడి రైతుల సంక్షేమానికి కష్ణా మిల్క్ యూనియన్ నిరంతర కషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు.పాడి రైతు సంక్షేమం మన మతం అలుపెరగని సేవ మన అభిమతం' అనే కార్యక్రమంలో భాగంగా బుధవారం హనుమాన్ జంక్షన్ క్లస్టర్ పరిధిలోని వైకుంట లక్ష్మీపురం, రామన్నగూడెం సొసైటీలను సందర్శించి అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, రైతులతో సమావేశం నిర్వహించారు. అబివృవద్ధికి చేపట్టాల్సిన అంశాలపై రైతులకు వివరించి నిర్వహణలో ప్రతి రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలని చలసాని ఆంజనేయులు అన్నారు. అనంతరం వైకుంట లక్ష్మీపురం గ్రామంలో ఉన్నత చదువులు చదివి కూడా పాడి మీద ఆసక్తి ఉన్న యువ పాడి రైతులను పొట్లూరి శ్రీకాంత్, చైతన్యాలను రామన్నగూడెం గ్రామంలో మూసి వేసిన పాల కేంద్రాన్ని తమ స్వంత ఖర్చులతో బాగు చేయించి ఆధునిక పరికరాలతో ప్రారంభించిన సంఘ అధ్యక్షులు రెడ్డి వీరాంజనేయులును,అధికంగా పాల ఉత్పత్తి చేసిన పాడి రైతులను సాలువాలతో చలసాని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిరణ్,సంఘ అధ్యక్షులు, సంఘ పాలక వర్గ సభ్యులు, సూపర్ వైజర్, పాడి రైతులు పాల్గొన్నారు.

సంఘ అధ్యక్షులు రెడ్డి వీరాంజనేయులును సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు

కేంద్ర సహకార బ్యాంకు పథకాలపై అవగాహన

పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉంగుటూరు : ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన కిసాన్ క్రెడిట్ కార్డు లను కలిగి ఉండటం ప్రతి ఒక్కరికి ప్రయోజనం కలిగిస్తుందని కాటూరు బ్రాంచ్ మేనేజర్ ఈడే శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం వేమండ సొసైటీ ఆవరణలో జరిగిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాబార్డ్ వారి సౌజన్యంతో జరుగుతున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో గ్రామీణ,పట్టణ ప్రజలకు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు గురించి వివరించారు.అలాగే కళాజాతా బందం కూడా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వివి కోటేశ్వరరావు, వేమండ సొసైటీ ప్రెసిడెంట్ సెనగవరపు సాంబశివరావు, సొసైటీ కార్యదర్శి వరకుమార్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నిర్వహిస్తున్న భవిత సెంటర్లో ప్రతి సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 14 మంది చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించగా ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 అన్నపరెడ్డి పిచ్చయ్య, ఐఈఆర్టీలు నాగ దుర్గ నాగమణి పాల్గొన్నారు.

మొవ్వలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ గ్రామంలో రూ.2.55 కోట్లతో నిర్మించి జలజీవన్ మిషన్ ద్వారా సరఫరా అవుతున్న ఇంటింటికి కుళాయి పని తీరితెన్నులను న్యూఢిల్లీలోని కేంద్ర సచివాలయ అసిస్టెంట్ ఆఫీసర్స్ బందం శుక్రవారం పరిశీలించి సంతప్తి వ్యక్తపరిచారు. న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన శ్రేష్టిభాటియా, వర్షిత్ ఠాగూర్, శుభం చౌహాన్, శివకుమార్ భరద్వాజ్, సాగర్ రావత్ బందం మండల ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కె ఎస్ ఆర్ ప్రసాద్ ద్వారా దీనికి సంబంధించిన వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. అదేవిధంగా మొవ్వ - 1సచివాలయాన్ని, జగనన్నకాలనీలో నిర్మించిన గహాలను, శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని, లెక్కల ల్యాబ్.ను, పిల్లలు ప్రదర్శించిన కూచిపూడి నత్యాన్ని, పాఠశాల పనితీరును పరిశీలించి ప్రధానోపాధ్యాయులు సబ్బినేని సాంబశివరావు ద్వారా పాఠశాల వివరాలను సేకరించారు. అనంతరం మహాకవి క్షేత్రయ్య ఆరాధ్య దైవమైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో జరిగిన పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఈవోపీఆర్డి వీర్ల సీతారామరాజు, ఏ ఈ ఆర్డబ్ల్యూఎస్ కె ఎస్ ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఆర్‌టిసి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మొవ్వ : మండల పరిధిలోని నిడుమోలు, మంత్రిపాలెం,అవిరిపూడి, పాలంకి పాడు, చినముత్తేవి, కారకం పాడు, కూచిపూడి తదితర గ్రామాల ఆర్.టి.సి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించి ప్రజల రవాణా ఇబ్బందులకు నివారించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో మచిలీపట్నం డిపో నుండి ఘంటసాల, శ్రీకాకుళం, పెదముత్తేవి, ఐనపూరు తదితర గ్రామాలకు బస్సు నడిపారని ప్రస్తుతం రద్దు చేయడంతో ప్రజలు ఆటోలలో ప్రయాణించవలసి వస్తుందని చెప్పారు. చినముత్తేవి వద్ద డ్రైన్‌పై వంతెన కూలిపోవడంతో తాత్కాలిక పద్ధతిన బెయిలీ వంతెన నిర్మించి భారీ వాహనాలను అనుమత్తించకపోవడంతో సర్వీసులు రద్దు చేశారని సాశ్వత వంతిన నిర్మించి బస్సు సర్వీసులు పునరుద్ధరించాలన్నారు. అప్పటి వరకు మినీబస్సులను ఏర్పాటు చేసి ప్రజల రవాణా కష్టాలను తీర్చాలన్నారు. గ్రామాల పర్యటన చేస్తున్న అధికార ప్రతిపక్షపార్టీల నేతలు ఈ విషయంపై దృష్టి చారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని శీలం నారాయణరావు సూచించారు.

గన్నవరం-పుట్టగుంట రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీ

రహదారి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం నియోజకవర్గంలో అభివద్ధి పరుగు పెడుతుందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ తెలిపారు. శుక్రవారం గన్నవరం మండలం బుద్దవరం పంచాయతీ దావాజిగూడెం గ్రామంలోని జెడ్. పి హైస్కూల్ దగ్గర గన్నవరం నుండి పుట్టగుంట వయా ఉంగుటూరు రహదారి విస్తరణ, బలోపేతం చేయడానికి రూ.35 కోట్ల నిధులతో నిర్మించనున్న రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో వంశీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గన్నవరం నియోజకవర్గానికి అటు రాజకీయంగానూ ఇటు అభివద్ధి విషయంలో ప్రత్యేక గుర్తింపు ఉందని, కోట్లాది రూపాయలతో సిమెంట్ రోడ్లు, ఇతర అభివద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో అభివద్ధి పనులు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కషి చేస్తుందని చెప్పారు. వైసిపి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన ప్రాథమిక అవసరాలను గుర్తించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో పనులు జరుగుతున్నాయని, ప్రభుత్వం నుంచి మరింతగా నిధులు సమీకరించి అభివద్ధిని ప్రజలకు చేరువ చేయడానికి కషి చేస్తున్నట్లు తెలిపారు. తాగునీరు డ్రైనేజీలు, సిమెంట్ రోడ్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగున్నర ఏళ్లలో నియోజకవర్గంలో 100 కోట్లకు పైగా నిధులు కేటాయించి బహత్తరమైన కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, జడ్పిటిసి ఎలిజిబెత్ రాణి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, మాజీ వైస్ ఎంపిపి గొంది పరాంధామయ్య, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాలుగో రోజున విద్యార్థినీ విద్యార్థులకు ప్రకతి-పరిసరాల పరిరక్షణ'పై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్త బి. వినోద్ కుమార్ 'డిజిటల్ గ్రంథాలయాలు - ఉపయోగాలు' అంశంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ 'తాళ పత్ర గ్రంథాలు -వాటి విశిష్టత' గురించి వివరించారు. చిత్ర లేఖనం పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.ఆది లక్ష్మి, బి. యల్ కుమారి వ్యవహరించారు.

దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నరుపేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు దంత సంరక్షణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సుదంతా దంత వైద్యశాల డెంటిస్ట్ డాక్టర్ సి.హెచ్.నారాయణరావు దంత సమస్యలు, పరిష్కారాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కే.రమాదేవి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన ప్రాధాన్యత భవనాల నిర్మాణాల ప్రగతి పై శుక్రవారం నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఆయన సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 233 గ్రామ సచివాలయాలలో 138, 141 రైతు భరోసా కేంద్రాలలో 76, అలాగే 114 వైఎస్ ఆర్ హెల్త్ క్లినిక్‌లకుగాను 55 భవనాలను పూర్తిచేసినట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఎస్ఈ, ఏ వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులు కె. కృష్ణ కిరణ్, బి. సుధ, పి.రమేష్, ఎన్ శివరామకృష్ణ, ఆర్ పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

సౌదారాణి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్

ప్రజాశక్తి - ఉయ్యూరు : విధి నిర్వహణలో ఉండగానే గుండెపోటుతో మరణించిన ముళ్లపూడి సౌదారాణికి శుక్రవారం పలువురు నివాళులర్పించారు. ఉయ్యూరు దళితవాడలో సౌదారాణి మృతదేహాన్ని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, కష్ణాజిల్లా కార్యదర్శి రమాదేవి, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.సుప్రజ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ బాధితురాలి కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సుమారు 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బందికి కనీస భద్రత లేదన్నారు. విధి నిర్వహణలోనే మరణించినా ఎలాంటి నష్టపరిహారం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. దీంతో అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ఇటువంటి సందర్భాల్లో నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ సిబ్బందిలో అధిక శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలే ఉన్నారని తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన అంగన్వాడీల కుటుంబాలను ఆదుకునేందుకు రూ.10 లక్షలు నష్టపరిహారంగా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఇల్లు లేని కార్యకర్తల కుటుంబాలకు ప్రభుత్వమే పక్కా గహాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంకిపాడు, పామర్రు ప్రాజెక్టుల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలతోపాటు యూనియన్ నాయకులు పోలి నాయుడు, బాల బాలగంగాధర్, కె.శివ నాగేంద్రం, బి రాజేష్, ఇందిరా, చిన్నారి విజయలక్ష్మి, సువర్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణలో ఐఆర్‌సి నిబంధనలు తప్పనిసరి

విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - విజయవాడ : నగరం మొత్తం ఐఆర్‌సి (ఇండియన్ రోడ్ కాంగ్రెస్) నిబంధనలకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ ఉండాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రోడ్ ప్రమాదాలను అరికట్టాలంటే ఐఆర్‌సి నిబంధనలే కీలకమన్నారు. శుక్రవారం విఎంసిలోని తన ఛాంబర్లో పోలీస్, ట్రాన్స్పోర్ట్, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయా శాఖలు సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపిఎస్ ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ ఎం.వై.దానం, ఆర్‌అండ్‌బి డిఈఈ డి.యస్.యస్.ప్రసాద్, నేషనల్ హైవే ఇంజనీర్ యం.వి. నాగేశ్వరావు, అడిషనల్ డిసిపి పోలీస్ డిపార్ట్మెంట్ ట్రాఫిక్- డి ప్రసాద్, విఎంసి చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్, రావు, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే.వీ.సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్, డిసిపి జుబిన్ సైరన్ రాయ్, డిసిపి-1 భాస్కర్ బాబు, ఎసిపి పి.మోహన్ బాబు, ఇఇలు కే.నారాయణ మూర్తి, వి. శ్రీనివాస, వి.చంద్రశేఖర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ వి నరసింహమూర్తి పాల్గొన్నారు.

హాస్యం, వ్యంగ్యం శ్రీరమణ రెండు కళ్లు

ప్రజాశక్తి - విజయవాడ : పత్రికల్లో పనిచేస్తున్న కాలంలో తాను రాసిన వ్యాసాలతో, శీర్షికలతో బాపు, రమణలకు చేరువై, రచయితగా పలు సినిమాలకు పనిచేసిన శ్రీరమణ సినీజీవితం 'గందరగోళం' సినిమాతో మొదలైందని ఆయన మేనల్లుడు కొప్పర్తి రాంబాబు అన్నారు. శ్రీరమణ కథ ఆధారంగా పదేళ్లక్రితం తెరకెక్కిన 'మిథునం' సినిమాతో ఎనలేని కీర్తి వచ్చిందన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంతరాయ గ్రంథాలయంలో శ్రీరమణ హాస్య రచనలపై రాంబాబు మాట్లాడుతూ హాస్యానికి, వ్యంగ్యానికి మధ్య అంతరం తెలిసిన రచయిత శ్రీరమణ అన్నారు. ఆత్మీయ అతిథి, కవి, విమర్శకులు డాక్టర్ సశ్రీ మాట్లాడుతూ పేరడీ కవిగా, హాస్య, వ్యంగ్య రచయితగా శ్రీరమణ తన పత్రికాశీర్షికలతో, అరుదైన కథలతో చిరకాలం నిలిచి ఉంటారన్నారు. గౌరవ అతిథి, శిఖర స్కూల్ డైరెక్టర్ బండ్ల మాధవరావు మాట్లాడుతూ 90 ఏళ్ల చరిత్ర కలిగిన హనుమంతరాయ గ్రంథాలయం తొలుత పూరిపాకలో ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ గ్రంథాలయం అధ్యక్షులు డోగిపర్తి శంకరరావు, ప్రకాశరావు, రచయిత, వైద్యులు డాక్టర్ జి వి పూర్ణచంద్, న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్ బాబ్జి, కార్యదర్శి నీలం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బోధనా పద్ధతుల్లో మార్పు రావాలి

సమగ్ర శిక్ష సంచాలకులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రస్తుత సాంకేతిక యుగానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా విధానాన్ని మలుచుకుని విద్యార్థులకు సులువైన పద్ధతిలో అర్థమయ్యేలా, ఆసక్తికరంగా బోధించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలో 'మ్యాథ్స్-సైన్స్ సిమ్యులేషన్ సాఫ్ట్వేర్' అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన వర్చువల్‌గా ముగింపోపన్యాసం చేస్తూ అన్ని పాఠశాలలకు 'స్టెమ్ ల్యాబ్'లు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎఎన్‌యు బొటనీ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డా. ఎ.అమతవల్లి మాట్లాడుతూ సిమ్యులేషన్ అంటే ఏంటి? టీచర్లు ఎలా బోధించాలో మెలుకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డా. కె.వి.శ్రీనివాసులురెడ్డి, 'కనెక్ట్ ఆంధ్రా' సీఈవో కె.శివశంకరరావు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా రుణాల మంజూరుకు అర్హులైన లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో కోరారు. వడ్రంగులు, సుత్తులు, తాళాలు, బంగారం పని, తాపి, దర్జి, మొదలగు చేతి వృత్తి కార్మికులకు ఈ పథకం కింద 5 శాతం వడ్డీ రేటుతో రూ.3 లక్షల వరకు బ్యాంకుల నుండి రుణ సహాయం అందిస్తారని తెలిపారు. వివరాలకు ఓ. హేమచంద్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ వారి కార్యాలయంలోని కామన్ సర్విస్ సెంటర్లు, వెబ్‌సైట్లో సంప్రదించాలని కోరారు.

NOTICE TO RESPONDENT
FORM No.11
(In the matter of the M.V.Act 1939)
MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL IN THE COURT OF THE HON'BLE PRIL DISTRICT JUDGE (MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL) AT ASIFABAD
M.V.O.P.NO. 92 /2022

Between:
Balakka Narayana Durgam ....Petitioners
//AND//
Mandala Nagaraju & others ....Respondents

To
R-2.). Mamilla Pothuraju, S/oRamarao, Age: 52 Years, Occ: Owner of Lorry.B.no. AP16TP3393, R/o, Kaishaka Arjunwada, Mudinepally, (V) & M Krishna Dist, AP.

Whereas Please take notice that the above named petitioner filed a petition against the respondents for the compensation under section 166 of M.V.Act 1988 and Rules 514 of A.P.M.V. Rule 1 you are hereby required to appear before the Hon'ble Chairman (MACT) cum Pril. District Judge, Asifabad to this court on 20-12-2023 at 10-30 AM in person or by pleader duly instructed able to answer all material questions relating to the above proceedings. You are hereby directed to appear before the said Court in person or by an Advocate, duly instructed. Failing which the petition will be heard and decided in your absence.

By Order of the Court.
Place: Asifabad.
Dated: 16-11-2023.

Sd/-
T. Suresh
Advocate, Asifabad
Kumuram Bheemu (Asifabad) District
sureshtatipelli@gmail.com
cell.9440086511

డాక్యుమెంట్స్ పోయినవి

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ గ్రామ కాపురస్థులు నల్లాని రఘునాథ్ తండ్రి సాయికృష్ణ (లేటు) సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి. డాక్యుమెంట్ నెంబర్ 1734/2014, చందాపురం గ్రామం , ఆర్ఎస్. నెం.89/3ఎ2లో 0.08 సెంట్స్ 950 చ. లింకులు భూమివిస్తీర్ణం గల దస్తావేజు.ఇంటి నుండి నందిగామ గాంధీ సెంటర్ కు జిరాక్స్ నిమిత్తం బైక్ పై వెళు తుండగా మార్గ మధ్యలో ఒరిజినల్ డాకుమెంట్స్ జారిపోయినవి.సదరు డాకుమెంట్స్ దొరికిన యెడల నల్లాని కనకదుర్గ, 618383749 సెల్ నెంబర్‌కి ఫోన్ చేసి ఇవ్వగలరు.తగిన పారితోషికం ఇవ్వబడును.

ఒరిజినల్ స్థలం లింకు డాక్యుమెంట్లు పోయినవి

విజయవాడ, అజిత్‌సింగ్‌నగర్, ఏకలవ్య స్ట్రీట్, ఎం.కె.బేగ్ స్కూల్, బ్లాక్ నెం.51కు చెందిన పేర్ల రత్నకుమారి, వైఫ్ ఆఫ్ నాగమల్లేశ్వరరావుకు చెందిన లింక్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్ (3675/2021) జిరాక్స్ తీయడం కోసం తేది 16-11-2023 ప్రభాస్ కాలేజి నుంచి పైపులు రోడ్డు వరకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యంలో ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు సర్టిఫికేట్సు కవర్ పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబర్‌కు ఫోన్ చేయగలరు.

ఇట్లు
పేర్ల రత్నకుమారి
సెల్ : 9505038256

మొదటిపేజీ తరువాయి

మార్కెట్ మాయాజాలం

నాణ్యత ఆధారంగా కొంటున్నారు. ఈక్రమంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో బిపిటి 5204 రకం వంగడాన్ని అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. జిల్లాలో 57,765 ఎకరాల్లో ఈ రకం సాగైంది. ఈనెల 10వ తేదీ నుంచి ఈ రకం వరి ధాన్యం కోత, నూర్పిడి (యంత్రాలతో) ప్రారంభమైంది. ఇది పూర్తయిన తర్వాత రోడ్లపై నాలుగు రోజులు ఆరబెట్టిన ధాన్యానికి పెడన, గూడూరు మండలాల్లో 75 కిలోల బస్తాను రైతుల నుండి మిల్లర్లు రూ.1700లకు కొనుగోలు చేశారు. తాజాగా పెడన, గూడూరు మండలాలతోపాటు బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర మండలాల్లోనూ కోతలు, నూర్పిడి పనులు జరుగుతున్నాయి. అయితే మిల్లర్లు ధర తగ్గిందని చెబుతూ బస్తాను రూ.1550లకు మాత్రమే కొంటున్నారు. కోతలు, నూర్పిడి పనులు ముమ్మరమైతే వీటి ధరలు ఇంకా తగ్గుతాయని చెబుతున్నారు. ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశంలేని రైతులు...మిల్లర్లు అడిగిన ధరకే విక్రయించేస్తున్నారు.

వ్యాపారులకు మిగిలేదే ఎక్కువ

కొత్త బియ్యం గంజి పడుతుందని, ప్రజలు పెద్దగా ఉపయోగించరనే కారణాలు చెప్పి వ్యాపారులు ధాన్యం రైతుల నుంచి తక్కువ ధరకు కొంటున్నారు. 75 కిలోల బిపిటి ధాన్యం మరపడితే 46 కిలోల నుంచి 48 కిలోల వరకు బియ్యంతోపాటు నాలుగు కిలోల నూక, ఐదు కిలోల తవుడు దిగుబడి వస్తుంది. ధాన్యం వర్కింగ్ సమయంలో వచ్చే నూక, తవుడు, ఊకలను వర్కింగ్, రవాణా ఛార్జీల కింద మిల్లర్లు మినహాయిస్తారు. కొత్త ధాన్యం మరతోపాటు స్టీం వేసి ఆ బియ్యాన్ని కిలో రూ.45కు మార్కెట్లో విక్రయిస్తున్నారు. రూ.1550కు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు రూ.2,160లకు విక్రయించుకుంటున్నారను. దీంతో బస్తా ధాన్యంపై వారికి రూ.610 వరకు మిగులుతోంది.

రైతులకు అయ్యే ఖర్చు...

బిపిటి రకానికి చీడపీడలు ఎక్కువగా ఉంటాయి. ఎకరా సాగుకు సగటున రూ.35 వేల వరకు ఖర్చవుతోంది. దిగుబడి 28 నుంచి 32 బస్తాల మధ్య వస్తుంది. బస్తాను రూ.1550లకు విక్రయిస్తే రైతు చేతికి రూ.43,400 నుంచి రూ.49,600 వరకు వస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు ఖర్చులుపోను ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.13 వేలు మాత్రమే మిగులుతోంది. ఈ ధాన్యం కొన్న మిల్లర్లకు మాత్రం రూ.17,080 నుంచి రూ.19,520 మిగులుతోంది.

తూకంలోనూ మోసం!

ధాన్యం విక్రయించే సమయంలో తూకంలోనూ రైతులను మోసం చేస్తున్నారు. 75 కిలోల బస్తా అని చెబుతూనే 76 కిలోలు లెక్కగడుతున్నారు. అరకిలోకు తక్కువగా ఉండే ఖాళీ గోనె సంచికి మరో కిలో చొప్పున మొత్తం రెండు కిలోలు తరుగు తీస్తున్నారు. ప్రస్తుతం మిల్లరు నిర్ణయించిన ధర ప్రకారం చూసినా ఒక బస్తాకు రైతల నుండి 41 రూపాయలకుపైగా దళారులు, మిల్లర్లు దోపిడీ చేస్తున్నారు.

స్వచ్ఛత వైపు మరో అడుగు

ఈ పింక్ టాయిలెట్లను నిర్వహిస్తారని తెలిపారు. మరుగుదొడ్లు, చేంజింగ్ రూమ్, పాలిచ్చే తల్లులకు ఫీడింగ్ రూమ్, సానిటరీ వెండింగ్ మెషిన్‌లో కేవలం ఐదు రూపాయలు పెడితే మూడు శానిటరీ నాప్కిన్స్ వచ్చే సదుపాయం కల్పిస్తూ, దీనిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా వాటి వాడకం గురించి ప్రజలందరికీ తెలియజెప్పాలన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రూ.20 లక్షలతో దీనిని నిర్మించినట్లు చెప్పారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ బెంజ్ సర్కిల్ వంటి జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రదేశంలో ఇటువంటి పింక్ టాయిలెట్‌ను నిర్మించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే.వి సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పి.రత్నావళి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఇక్బాల్ హుస్సేన్, డిసిపి జుబిన్ సైరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఏయస్‌యన్ ప్రసాద్, చంద్ర శేఖర్, మారిస్ స్టెల్ల కాలేజీ ఉపాధ్యాయురాలు స్వప్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 16వ అదనపు జడ్జి నందిగామ వారి కోర్టులో
ఓ.ఎస్.నం. 8/2023
సూర్యదేవర రవీశ వగైరాలు .... వాది
ఎదురి
యనమదల గోపి వగైరాలు .... ప్రతివాదులు
పాపోలు నరసింహారావు, తండ్రి కోటయ్య, ఇంటి నంబరు 20 -303 -2, బ్రహ్మపురం
చిలకలపూడి రూరల్ , మచిలీపట్నం, కృష్ణాజిల్లా

పై నంబరు గల దావా నందు మీరు 3 ప్రతి వాది అయిఉన్నారు. శ్రీ కోర్టు నుండి దావా సమనులు ఎన్ని పర్యాయములు పంపి నను బుద్ధి పూర్వకముగా తీసికొనకుండా కాలయాపన చేయు చున్నారు. అందు వలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ఈ దావా తేదీ 08-12-2023 న వాయిదా అయి ఉన్నదని ఈ ప్రకటన ద్వారా తెలుపటమైనది. సదరు వాయిదా రోజున ఉదయం గం 10 .30 ని లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కానీ వకీల్ ద్వారా గని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరచవలయున.లేనిచో ఈ దావా ను మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ పరచటమైనది
వాయిదాతేదీ : 08 -12 -2023

సరళ బెనర్జీ
వాది తరపు న్యాయవాది

ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో అవనిగడ్డ, పెనమలూరు నియోజకవర్గాల శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, కొలుసు పార్థసారథి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ లతో కలిసి జిల్లాలో ధాన్యం సేకరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు ధాన్యం సేకరణలో కీలకమైన గోనె సంచుల సరఫరా, రవాణా, వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ పరికరాల ఏర్పాటు, మాయిశ్చరైజేషన్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలలో సరిపోయినన్ని గోనె సంచులు అందుబాటులో ఉంచేలా చూడాలని, కోతకు ముందే రైతులు ఆర్బీకేలకు ముందస్తు సమాచారం ఇచ్చే విధంగా వారికి అధికారులు అవగాహన పరచాలన్నారు. పంట కోయకుండానే ముందస్తుగా తమ వద్ద గోనె సంచులను వృధాగా అట్టిపెట్టుకునే విధంగా రైతులకు ఇవ్వరాదని, లేదంటే అవసరమైన వారికి సంచుల కొరత ఏర్పడే అవకాశం ఉందని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రైతులు తమ పంటకు పూర్తి మద్దతు పొందే విధంగా ఆర్ బి కే లోని టెక్నికల్ అసిస్టెంట్లు, సెక్రటరీలకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం రకాలు బిపిటి 5204, 1224 వంటి సన్న రకాలకు బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ మద్దతు ధర కన్నా ఎక్కువ ధర పొందే అవకాశం ఉంటే తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని రైతులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ల అధికారులు ఎం.వాణి, పి.పద్మావతి, రాజు, డీఎస్ఓ వి.పార్వతి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీధర్, డిసిఓ ఫణి కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి పురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు యుటిఎఫ్ జిల్లా వార్షిక సమావేశం

ప్రజాశక్తి - గుడివాడ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కృష్ణా జిల్లా శాఖ 48 వ వార్షిక నూతన కౌన్సిల్ సమావేశం ఈ నెల 19 వ తేదీ ఆదివారము పెదపారుపూడి మండల శాఖ ఆధ్వర్యంలో గుడివాడలో గల కాపు కళ్యాణ మండపంలో కామ్రేడ్ అక్కినేని కృష్ణ సుందర రావు ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర రావు ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిధులుగా యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఎస్.ఎస్. ప్రసాద్, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎం.ఎల్.సీ. కే.ఎస్.లక్ష్మణ రావు, మాజీ ఏం.ఎల్.సీ. బొడ్డు నాగేశ్వర రావు తదితరులు హాజరై సందేశాలు ఇస్తారని తెలిపారు. ఈ కార్య క్రమంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న వివిధ పథకాలను, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ వైఖరిని సమీక్షించుకుని వివిధ తీర్మానాలను ఆమోదిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభ మవుతుందనీ, ఈ సమావేశాలకు జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రోలార్ స్కేటింగ్‌లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుడివాడ : ఈ నెలలో జరిగిన రాష్ట్రస్థాయి రోలార్ స్కేటింగ్ ఫెడరేషన్ లో విశ్వభారతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ పొట్లూరు శ్రీమన్నారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్ లోని విశ్వ భారతి విద్యాసంస్థలలో చైర్మన్ పొట్లూరు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రోలార్ స్కేటింగ్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోలార్ స్కేటింగ్ విభాగంలో ఎస్ నాగ శివాత్మక స్వర్ణంతోపాటు రజత పతకాన్ని సాధించారన్నారు. పి కౌశిక్ సాయి, కే సాయి వర్షిత,ఎం రోహన్ స్వర్ణ పథకాన్ని, ఎం జిషిత సావిత్రి, ఆర్యే విన్సాల్, కే శ్యామ్ రజత పథకాలను, ఎం ఉమేష్ ఉమా మహేష్, డి ఆశిష్ గాంధీ కాంస్య పతకం సాధించడం గర్వకారణం అన్నారు.

నేటి నుండి కులగణనపై శిక్షణ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పురపాలక సంఘ పరిధిలో గల వార్డు సచివాలయ సిబ్బందికి శనివారం కులగణనపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీ పట్టణంలోని సచివాలయంలో కుల గణన ఆడుదాం ఆంధ్ర అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వాలంటీర్లు సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని శిక్షణ తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశకి-మచిలీపట్నంరూరల్ : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అంతర్జాతీయ గుర్తింపు పొందిన సాహిత్య సంస్థ అయిన ఆంధ్ర సారస్వత సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిం చారు. సంస్థ ఉపాధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ ఈ కార్యక్రమంలో లేడీ యాంప్తిల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఐనంపూడి ఆనంద్ కుమార్, ప్రముఖ కవి మేడిశెట్టి యోగేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు ఉమ్మిటి విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు ఆంధ్ర సారస్వత సమితి బహుమతులను అందజేసింది. **ప్రజాశక్తి - మొవ్వ** : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో గల శ్రీ బాలా త్రిపుర సుందరి గ్రంథాలయంలో పుస్తక పఠనం కొనసాగింది. శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థులు పుస్తకాలు చదివే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెమ్మాని శేష సాయి కుమార్ ప్రారంభించి విద్యార్థినులకు గ్రంథాలయాల వలన లభించే ఉపయోగాలు పై అవగాహన కల్పించారు. గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరపు వెంకటేశ్వరఫణికుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి ఘంటసాల : ఘంటసాల శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఘంటసాల మహాత్మాగాంధీ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. హై స్కూల్ ఉపాధ్యాయులు గ్రంథాలయ అధికారి ఎం శరత్ కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ శాఖ గ్రంథాలయం కొడాలిలో గ్రంథాలయ అధికారి ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థినిలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : జాతీయ గ్రంథాలయ 56వ వారోత్సవాలను పురస్కరించుకొని అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం ఆవయ కథ అంశంపై వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి ,ప్రముఖ రచయిత గుడిసేవ విష్ణు ప్రసాద్, కవిత్రులు సింహాద్రి పద్మ, దివి, ఝాన్సీ, జే రామకుమారి, గాయకులు కే చంద్రశేఖర్ పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి జె ప్రభుదాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రంథాల అధికారిని టి. వాణి తెలిపారు. కవి జిఎం పీటర్ మాతృమూర్తి అయిన తల్లి గురించి కవితలను చదివి వినిపించారు. మధ్యాహ్నం సీనియర్, జూనియర్ విద్యార్థులకు చిత్రలేఖన, పరుగు పందాలు మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణీతగా ఎన్ కృష్ణస్వామి, జి దేవి వ్యవహరించారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : విజ్ఞాన బాండా గారాలైన గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి చేరుకో వాలని గుడివాడ డీవైఈఓ ఐ.పద్మారాణి అన్నారు. ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు వక్తృత్వపోటీలు నిర్వహించారు. పోటీలకు ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు చోరగూడి విద్యావతి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సాంబశివరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి బి. రమణి పర్యవేక్షించారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : మండలంలోని మానికొండ గోగినేని పిచ్చయ్య చౌదరి జిల్లా పరిషత్ పాఠశాలలో జూనియర్ సీనియర్ విభాగాల విద్యార్థినీ విద్యార్థులకు చిత్రలేఖనం వ్యాసరచన పోటీలు నిర్వమించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే శివరామకృష్ణ, కమలారాణి, టి. నాంచారయ్య వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : గ్రంథాలయాలు కదిలే దేవాలయాలని, విద్యార్థి గ్రంథాలయాలను వినియోగించుకోవాలని పెనుముచ్చ గ్రంథాలయ శాఖ అధికారి సుబ్బారావు అన్నారు. మండలంలోని పలు చోట్ల జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో అధికారులు పాల్గొన్నారు. అగ్నిపర్ గ్రంథాలయ శాఖలో బొబ్బ లావణ్య, మేడూరు గ్రంథాలయ శాఖలో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు జరిగాయి. ఈ సందర్భంగా వికేఆర్ కళాశాల విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు శాయోజరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని చెప్పారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు అధ్యక్షత వహించిన కార్యక్రమాల్లో విశ్రాంత అధ్యాపకులు గన్నే వెంకట్రావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల** : గ్రంథాలయాలు కదిలే దేవాలయాలని, విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెనుముచ్చ గ్రంథాలయ శాఖ అధికారి సుబ్బారావు అన్నారు. పమిడిముక్కల మండలంలో పలుచోట్ల వారోత్సవాలు నిర్వహించారు. అగ్నిపర్ లో నిర్వహించినకార్యక్రమంలో బొబ్బ లావణ్య, మేడూరులో శ్రీనివాసరావు, అయినపూరల్‌లో షరీఫ్, కపిలేశ్వరంలో ప్రతాప్ తదితరులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మచిలీపట్నంరూరల్‌లో...

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఏఏఎన్ఎం అండ్ వివిఆర్ఎస్ ఆర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో డిఎస్‌టి న్యూఢిల్లీ ప్రాజెక్ట్ వెలుగు బాట మొదటి దశ ,రెండో దశకు శుక్రవారం చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయస్థాయి సంచాలకులు ఎస్‌జి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ పునరుత్పాదక శక్తిపై పనిచేసే 105 భౌతిక నమూనాలను విద్యార్థులకు పరిచయం చేసి, అవి పనిచేసే తీరును సోదాహరణ పూర్వకంగా పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు. ఆర్టికల్ 51 ఏ ప్రకారం ప్రాథమిక హక్కు అయినా శాస్త్రీయ దృక్పాదన కలిగి ఉండటం అనేది నేటి వ్యవస్థలో కొరవడుతుందని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో ముఖ్యంగా విద్యార్థిని విద్యార్థులలో సైంటిఫిక్ టెంపర్‌మెంట్ సైన్స్ ప్రయోగాలు, సైన్స్ ప్రదర్శనలు, సైన్స్ కార్యశాలలు ద్వారా కలిగించటమే తన లక్ష్యాన్ని పేర్కొన్నారు. విద్యార్థులకు భౌతిక శాస్త్ర వివిధ అంశాలపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ జి ఇ సి ప్రిన్సిపల్ డాక్టర్ జి వి ఎస్ఎన్ఆర్ వి ప్రసాద్, డాక్టర్ ఎస్ సురేష్, డాక్టర్ వి నవీన్ కుమార్, డాక్టర్ పి విజయలక్ష్మి, డాక్టర్ వై రామకృష్ణ, టీవీ నర్మదా, డాక్టర్ షేక్ బాజివాలి తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' కరపత్రాల పంపిణీ

గుడ్లవల్లేరు మండలంలో

ప్రజాశక్తి-ఘంటసాల : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగు దేశం పార్టీ నాయకులు ప్రజలకు వివరించారు. శుక్రవారం ఘంటసాల గ్రామంలో బాబు షురిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తికొండ వరప్రసాద్, బండి పరాత్పరరావు, అయినపూడి భాను ప్రకాష్, సోలే శ్రీను తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి** : బ్బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారంటీ" కార్యక్రమం పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా శుక్రవారం పెదపారుపూడి మండలం వెంట్రుప్రగడ గ్రామంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరిచ మండల పార్టీ కార్యదర్శి పసుపు రాంబాబుచ గొరిపర్తి రవి కుమార్‌చ కూచిపూడి సుబ్బయ్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : "బాబు షరిటీ భవిషత్తు గ్యారెంటీ" కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిత్రం గ్రామంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి గుడివాడ నియోజకవర్గ ఇంచార్జ్ రావి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. జనసేన పార్టీ గుడ్లవల్లేరు మండల అధ్యక్షులు తోట చిన్నారి జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్ , క్లస్టర్ ఇంచార్జ్ కొడాలి రామరాజు, మల్ల వెంకట రామారావు, బొప్ప సత్యానారాయణ పాగోలు శ్యాంబాబు, ఉద్ధగిరి శ్రీనుబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జనసేన నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని 7వ వార్డులోని కొత్తపేటలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు డి రాంబాబు జనసేన పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శి సాయిని రాజేష్, క్లస్టర్ ఇంచార్జి ముళ్ళపూడి రమేష్ చౌదరి, నాయకులు తేనెల ఏడుకొండలు, కోసూరు ఆంజనేయులు పాల్గొన్నారు.

పెదపారుపూడి మండలంలో...

దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి కొట్టు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి అమ్మవారి దర్శనానికి ఉప ముఖ్య మంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం విచ్చేశారు.. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రికి కార్యనిర్వాహనాధికారి కె ఎస్ రామ రావు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు.. వీరు కార్తీక మాసం సందర్భంగా దేవస్థానం నందు ప్రదోషకాలంలో నిర్వహించుచున్న ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలో పాల్గొని దీపములు వెలిగించారు.. దేవస్థానం నందు భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల సదరు ఏర్పాట్లను కొట్టు సత్యనారాయణ పరిశీలించారు.. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రితో పాటుగా ఎన్‌టి ఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఆలయ కార్యనిర్వాహనాధికారి కె ఎస్ రామారావు, పశ్చిమ ఏసిపి డా. హనుమంతరావు, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్లు కెవి ఎస్ కోటేశ్వరరావు, లింగం రమ, స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద శర్మ పాల్గొన్నారు.

స్వామిజీలను కలిసిన దుర్గగుడి ఇఒ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం కార్యనిర్వహణాధికారి కెఎస్ రామారావు శుక్రవారం విశాఖ శారదా పీఠాధిపతులవారు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీని మరియు శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర స్వామీజీని మర్యాద పూర్వకంగా కలిసి, అమ్మవారి ప్రసాదములు, పండ్లు, వస్త్రం అందజేశారు. అనంతరం దేవాలయం నందు జరుగుచున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. స్వామీజీ వారు దేవాలయంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందే విధంగా మరిన్ని కార్యక్రమాలు చేయాలని ఆలయ కార్యనిర్వాహణాధికారికి సూచించారు.

గ్యార్మీ మహోత్సవంలో పాల్గొన్న గయాజుద్దీన్, బేగ్, కమాల్

గ్యార్మీ మహోత్సవం

ప్రజాశక్తి - భవానీపురం : జనసేన మైనార్టీ నాయకులు, నగర అధికార ప్రతినిధి.ఐగా గ్రూఫ్ చైర్మన్ షేక్ గయాజుద్దీన్ (ఐజా) ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం భవానీపురంలోని స్వాతి సెంటర్ సమీపంలో గల మసీదు రజీ వీధిలో 17వ గ్యార్మీ వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత సాంప్రదాయ బద్ధంగా పూజాదికాలు నిర్వహించి. జెండాలను వాహనాలకు ఏర్పాటుచేసి భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్, జనసేన సీనియర్ నాయకులు కమాల్ హాజరై గ్యార్మీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గయాజుద్దీన్ మాట్లాడుతూ ఏక్యూ రజా కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా గ్యార్మి మహోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జనసేన నాయకులు కమాల్ మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సారధ్యంలో రానున్న రోజుల్లో రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. ఈ సందర్భంగా అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్, సారిపల్లి రాధాకష్ణ, చిన్న సుబ్బయ్య, జనసేన మైనార్టీ నాయకులు కమాల్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

క్వాడ్రాంగ్యులర్ క్రికెట్ టోర్నీ : భారత్ 'ఎ ' ఘన విజయం

- బంగ్లాదేశ్‌పై ఇంగ్లాండ్ విజయం - పరుగుల వరద

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : బీసీసీఐ (భారత క్రికెట్ నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసిఎ) పర్యవేక్షణలో అండర్ -19 క్వాడ్రాంగ్యులర్ వన్డే క్రికెట్ టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో ఇండియా - ఎ జట్టు, ఇంగ్లాండు జట్టు విజయం సాధించాయి. మూలపాడులోని డివిఆర్ గ్రౌండ్‌లో ఇండియా - ఎ, ఇండియా - బి జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈమ్యాచ్‌లో ఇండియా ఎ జట్టు రెండు వికెట్ల ఆధిక్యతతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇండియా ఎ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీనితో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా -బి జట్టు 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 375 పరుగులు చేసింది. జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ రుద్ర మయూర్ 134 బంతుల్లో ఎనిమిది సిక్సర్లు, 16 బౌండరీల సహాయంతో 164 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ సచిన్ దాస్ 112 బంతుల్లో ఏడు సిక్సర్లు, పది బౌండరీల సహాయంతో 135 పరుగలు చేశాడు. ఇండియా బి జట్టు బౌలర్లు మురుగన్ రెండు, సౌమ్య కుమార్ ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం 376 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా - ఎ జట్టు 46.3 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 378 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని అరవెల్లీ అవనీష్ 93 బంతుల్లో 12 సిక్సర్లు, 12 బౌండరీల సహాయంతో 163 పరగులు, మురుగన్ అభిషేక్ 62 బంతుల్లో ఒక సిక్సర్, ఎనిమిది బౌండరీల సహాయంతో 81 పరుగులుచేశారు. ఇండియా బి జట్టు బౌలర్లు ప్రేమ్ మూడు వికెట్లు, విగ్నేష్ మూడు వికెట్లు తీసుకున్నారు. ఇండియా ఎ జట్టు విజయం సాధించడంతో రెండు పాయింట్లను ఇచ్చారు. ఇండియా ఎ జట్టు బ్యాట్స్‌మెన్ అరేవిల్లీ అవనీష్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రకటించారు.

13 పరుగులతో ఇంగ్లాండ్ విజయం... ఇంగ్లాండ్, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 13 పరుగుల ఆధిక్యతతో ఇంగ్లాండ్ జట్టు విజయం సాధించింది. ఈమ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీనితో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ జట్టు 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 322 పరగులు చేసింది. జట్టులోని హంజా షేక్ 119 బంతుల్లో 126 పరుగులు, తయన్ 113 బంతుల్లో 88 పరుగులు చేశారు. బంగ్లాదేశ్ బౌలర్లు ఎం డి ఇక్బాల్ హజన్ నాలుగు వికెట్లు, మురుఫ్ మృదా మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 323 పరగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ జట్టు 49.3 ఓవర్లలో 309 పరుగులకే అంతా అవుటయ్యారు. దీనితో 13 పరుగుల ఆధిక్యతతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ షేక్ జిబిన్ 60, అ మీన్ 66, పరుగులు చేశారు. ఇంగ్లాండు బౌలర్లు ఎడ్వర్డ్ జాక్ ఐదు వికెట్లు, మిచెల్లి మూడు వికెట్లు, తీసుకున్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి. మనోహర్ కుమార్

మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయుటకు నోటిఫికేషన్ విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్ కుమార్ అన్నారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశం శుక్రవారం సాయంత్రం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మనోహర్‌కుమార్ మాట్లాడుతూ 2018 డిఎస్‌సి తరువాత నేటికీ కూడా ఒక డిఎస్‌సి కూడా వేయకపోవడాన్ని తప్పుపట్టారు. డిఎస్‌సి నియామకాలు జరిపి సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టుల్లో ప్రమోషన్‌లివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీసులు రూల్స్ విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని సబ్జెక్టులలో 2024 సంవత్సరం రిటైర్ అవుతున్న వారి రిటైర్మెంట్ నోటీస్‌లు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు మచ్చా శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, జిల్లా సహాధ్యక్షురాలు డి.అపర్ణ, జిల్లా కార్యదర్శిలు కె.గంగరాజు, బి.సిహెచ్. సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జీవిత భాగస్వామి తోడ్పాటుతోనే విజయం

మాట్లాడుతున్న జమల పూర్ణమ్మ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భార్యాభర్తల మధ్య సరైన అవగాహన లేక చిన్న చిన్న విషయాలపై మవస్పర్ధలు ఏర్పడి వైవాహిక బంధాలు విచ్ఛిన్నమవుతున్నాయని కృష్ణాజిల్లాల గ్రంథాలయం సంస్థ సంచాలకులు తిప్పరమల్లి జనాలు పూర్ణమ్మ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సంయుక్త నిర్వహణలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 'నా విజయంలో...జీవిత భాగస్వామి' అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ దంపతులు తామే గొప్ప అహంభావం ధోరణి విడనాడి ఒకరికి ఒకరు సహకారం అందించుకుంటే విజయం మీదే అన్నారు. వాకర్స్ జిల్లా గవర్నర్ డివిఎస్.రామలింగరాజు సభాప్రారంభకులుగా ప్రతి వ్యక్తి విజయం వెనుక వారి జీవిత భాగస్వామి సహకారం ఉంటుందన్నారు. జ్యోతి ప్రకాశనం చేసిన లయన్స్ క్లబ్ దుర్గాతేజ అధ్యక్షురాలు దుంపల లక్ష్మీకుమారి, సభాధ్యక్షులు ఎక్స్ రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, ఠాగూర్ గ్రంథాలయ అధికారిణి కొల్లూరు రమాదేవి మాట్లాడారు. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు బ్రహ్మదేశం వసంతకుమార్ పాల్గొన్న దంపతులను, అతిథులను సత్కరించారు. చామర్తి వెంకట సుబ్బయ్య, గుర్రం ఏడుకొండలు, కొణడాయగుంట రాము సహకరించారు.

'రెయిన్‌బో చిల్డ్రన్స్'లో ప్రీ మెచ్యూరిటీ డే వేడుకలు

జ్యోతిప్రజ్వలన చేస్తున్న సబ్ కలెక్టర్ అదితి సింగ్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : నెలలు నిండని శిశువులకు చికిత్స అందించడంలో రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పటల్ విశేష కృషి చేస్తుందని పలువురు వక్తలు అన్నారు. రింగురోడ్డు వద్ద గల హోటల్ నోవాటెల్‌లో నెలలు నిండకుండా జన్మించిన శిశువులకు తల్లిపాలను దానం చేసిన తల్లులకు సత్కార కార్యక్రమం, ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డే వేడుకలను శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాల వల్ల నెలలు నిండకుండా శిశువులు జన్మిస్తున్నారని, అటువంటి వారికి చికిత్స అందించడంలో రెయిన్‌బో హస్పటల్ విశేష కృషి చేస్తుందని అన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పటల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ జరుపుకోవడం చిన్నారుల శక్తిని గౌరవించడానికి వారి ప్రయాణంలో కీలకపాత్ర వైద్య సిబ్బందికి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య ప్రముఖులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మైలవరం : ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జి.కొం డూరు మండలం కండ్రిక వద్ద జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం కోడూరు శివారు గ్రామం కండ్రికకు చెందిన నారదాసు రవీంద్రబాబు (25) ఎలక్ట్రీషియన్‌గా చేస్తుంటాడు. గురువారం రాత్రి మైలవరంలో పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రవీంద్రబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అక్రమాలను అరికట్టాలని స్థానికులు కోరారు.

జగన్‌తోనే పేదలకు న్యాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2024 ఎన్నికల్లో కూడా గెలవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తనయులు యువనాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ బాబు అన్నారు. పట్టణంలోని 3వ సచివాలయం 3, 4 వార్డులు పుట్ట బజార్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, కేడీసీసీ మాజీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ , కౌన్సిలర్ కాశీ అనురాధ తదితరులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల సంక్షేమ పాలనలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమం అందించిన ఘనత మన జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు ఖాదర్ బాబు, సచివాలయ కన్వీనర్ పందిటి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని చింతలనర్వ గ్రామంలో గల సిఎస్‌ఐ పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయంలో వినతిపత్రం అంజదేశారు. చింతలనర్వ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న గద్దల నాగమణిని రెండు పాఠశాలలకు విధులు నిర్వహించాలని విద్యాశాఖ అప్పగించింది. ఈ మేరకు సమస్యను తెలియజేస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు గౌర్రాజు కోటేశ్వరరావు, పోతురాజు ఏడుకొండలు, పూర్వ కార్యదర్శి సిహెచ్ రమేష్, కే మురళి, ఉన్నారు.

మధుమేహానికి ఇన్సుక్విక్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : మధుమేహం ఉన్న వారికి చికిత్స అందించడంలో ఉపయోగపడేలా ఇన్సులిన్ అస్పార్ట్, ఇన్సూక్విక్‌ను విడుదల చేసినట్లు యూఎస్‌వి ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి కె.ఎస్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో మధుమేహం ఎక్కువ మందికి పెరగడంతో పాటు ఇది ప్రధాన ఆరోగ్య సమస్యగా ఉందన్నారు. డయాబెటిక్‌తో బాధపడే వారి సంఖ్య పెరగడంతో వారికి ఉపయోగపడేలా ఇన్సులిన్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.